# ఆవు - పులి

కలియుగే, ప్రథమపాదే, జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే,

అస్మిన్ వర్తమానేన వ్యావహారిక చాంద్రమానేన... సంవత్సరాణాం.

నాలుగు వేదాలూ నమిలేసిన ఆ అగ్రహారం ఒక కొండవార నీడలో ఉంది. అక్కడ అన్ని కులాలవాళ్ళూ తమ కులవృత్తులు చేసుకుంటూ, ధర్మాన్ని పెంపొందిస్తూ, అధర్మాన్ని అసహ్యించుకుంటూ, చల్లగా, హాయిగా జీవిస్తున్నారు. ఏడాదికి మూడు కుంచాల వర్షం, పదహారణాల వంటా వారికి మామూలు ఐపోయేయి. కలికాలం అయినా వారు ధర్మాన్ని పిలకపట్టుకొని నాలుగు కాళ్ళమీద నడిపిస్తున్నారు. యిది ఇలావుండగా ఆ వూరు ఒకస్వామి వచ్చేరు. వారు వేదాల్నీ, వేదాంగాల్నీ ఏనాడో నమిలేసేరు. సకల శాస్త్రాలనీ పిడిచి తాగేసేరు. వారు చూపులకి బంగారం పిసికి చేసినట్టు వుంటారు. ఇన్ని వున్నా, వారికి 'నాది' అని చెప్పుకోడానికి కౌపీనం మినహా ఇంకేమీ లేదు.

వేదవేదాంగాలు చదివినవారికి కూడా ఆకలివేస్తుంది. స్వామి పాలు మినహా ఇంకేమీ పుచ్చుకోరు, అంచేత ఒక

వైశ్య శిఖామణి వారికి దూడతో సహా ఒక ఆవుని దానం చేశాడు.

ఆవు నల్లగా వుంటుంది. దూడకూడా నల్లగానే ఉంటుంది. ఆవుకి ఎక్కడా మచ్చలేదు. దూడకి కూడా లేదు. దూడ నెమ్మదైంది. ఆవు ఇంకా నెమ్మదైంది. దాన్ని ఎంచేతో 'కామధేనువు' అని పిలవకుండ 'గంగిగోవు' అని పిలిచే వారు ప్రజ. అది ఏ పొలంలో మేసినా ఎవరూ అడ్డుపెట్టరు. అయినా అది తన పేరు సార్థకం చేసుకోవడానికే అన్నట్టు ఎవరి పొలంలోనూ మేయక, 'దొంగపాలు' యజమానికి యివ్వడం యిష్టం లేక, అది కొండవార పచ్చికలో మేసేది. కొండ దిగువ ఏట్లో నీళ్ళుతాగేది. గడ్డీ, నీళ్ళూ కలిసి చిక్కటి పాలు యిచ్చేది.

మంచికాలం యిలా కొంత గడిచేక ఆవేళ మధ్యాన్నం ఝామున్నరైంది.

గంగిగోవు మేస్తున్న బీటిలో పచ్చిక భూమిమ్మీద పరుచుకున్న మేఘంలా వుంది. దానిమీద పడిన కొండనీడ— నీటినీడలా—చల్లగావుంది. దూరం నుండి చూస్తే పచ్చికలో మేస్తున్న గంగిగోవు - వెన్న కంపెనీ ఎడ్వర్ టైజ్ మెంటు బొమ్మ ఆవులాఅందంగా, ఆరోగ్యంగా ఉంది.

అంతలో గంగిగోవు తల ఎత్తి చూసింది. కొండనీడ చింతతోపు చివరికి వచ్చేసింది. అంటే "అమ్మ బాబోయ్ !" ఆశ్రమానికి వెళ్ళి పోవలసిన కాలం వచ్చేసిం దన్న మాట

గంగిగోవుకి యింకా ఆకలి తీరలేదు. అయినా అది దొంగ గొడ్డు కాదు కాబట్టి ఇంటికి వెళ్ళడానికి వాగువేపు పరి గెత్తింది.

వాగు నీటిలో కొండరంగు కరిగినట్టు నీరు నీలిగా ఉంది. కొండమీది ఓషధులసారం అంతా గ్రహించినట్టు ఆ నీరు చాలా చల్లగానూ, ఉత్తేజకరంగానూ ఉంది.

గంగిగోవు నాలుగు గుక్కలు నీరు తాగిందో లేదో, దాని వాగు గట్టుమీదినుండి ఒక భయంకరమైన అరుపు విని పించింది. ఆ అరుపుకి నీరు గడ్డకట్టి పోయింది. అప్పుడు గంగిగోవు చూలుతో ఉండి వుంటే దాని కడుపులో పిల్ల చచ్చిపోయేది.

గంగిగోవు తల ఎత్తేసరికి దానికి దగ్గర్లోనే ఒక నల్ల రాతిమీద ఒక వింత జంతువు నిలబడి ఉంది. అది రాజు గార్లా దర్జాగా ఉండడమే కాకుండా, అప్పుడే నిద్రలేచిన రాజుగారిలా బద్ధకంగా కూడా ఉంది.

గంగిగోవు అమాయకంగా ఆ జంతువువేపు చూసింది.

"నేను పులిని" అంది ఆ జంతువు.

"మిమ్మల్ని కలుసుకున్న నేను అదృష్టవంతురాల్ని" అంది ఆవు.

"నా కాఃక శేఃస్తోంది" అంది పులి.

"పాలిచ్చేదా!" అంది అమాయకంగా ఆవు.

"మేం పులిపాలు తప్ప తాగం" — అధికారంగా ప్రకటించింది పులి.

"ఇక్కడ గడ్డి చాలా రుచిగా వుంటుంది."

"గడ్డి గోవులు తింటాయి"—నిరసనగా నవ్వింది పులి.

"మరి మీరు......?"

"గోవుల్ని తింటాం. మీకూ, మాకూ, పరస్పర విరోధం కావలిస్తే పంచాంగం చూచుకో."

ఆవుకి మాట రాలేదు. పులిని చూస్తే అది అబద్ధమాడే రకంలా లేదు.

"నా మాట అబద్ధమేమో చూడు. నిన్ను మెల్లిగా పంజాతో ఒక దెబ్బ కొడతాను. ఆ తర్వాత పూర్తి దెబ్బ తట్టుకోగల వేమో చూడు" అని అర సెకండు ఆగకుండా గంగిగోవు తలమీద పావు బలంతో ఒక దెబ్బ కొట్టింది పులి.

ఆవుకి యినపరాయితో తలమీద ఎవరో రాక్షసుడు కొట్టినట్టు అయింది. తల పగిలిపోయినట్టు రక్తం చిమ్మింది. కళ్ళల్లో రక్తం పడి ఎదురుగా ఉన్న పులి రక్తంలో స్నానం చేసిన దానిలా భయంకరంగా కనిపించింది.

"నువ్వు నల్లదానివి, అంటే మంచి దానివీ, తెలివైన దానివీ అన్నమాట. నేను నిన్ను అరక్షణంలో చంపగలనని ఈ పాటికి గ్రహించే వుంటావు. ఇంత మంచిదానివి నిన్ను ఎక్కువ బాధ పెట్టి చంపదలుచుకోలేదు. నువ్వు పెనుగులాడ

కుండా ఉంటే మూణ్ణిమిషాల్లో పని పూర్తి చేస్తాను" అంది పులి. పనిలోకి దిగడానికి సిద్ధపడుతూ.

ఆవు పవిత్రమైన ఆశ్రమ వాతావరణంలో పెరిగింది చావు అంటే ఈ ఐహిక బంధాలనుండి ఆత్మవిముక్తి పొందడం అని ఏనాడో గ్రహించిన దవడంవల్ల పులి అన్నమాటకు జడవలేదు. కాని దాని మనసు ఒక్కసారి ముడిపడినట్టు బాధపడింది, తన పిల్లని తల్చుకోగానే.

అంచేత "ఓ పులి పుంగవా! నేను గోవుని. అంటే జీవరాసుల్లో పవిత్రమైనదాన్ని, నీ ఆకలి తీర్చే అవకాశం ఇచ్చిన నీకు ఎలా ధన్యవాదాలు చెప్పుకోవాలో తెలియడం లేదు. నువ్వు కొట్టిన చావుదెబ్బతో బతకడం చావుకన్న దుర్భరంగా ఉంది. కాని ఒక్క మనవి. ఇప్పుడు నీ అంత ఆకలితోనూ నా బిడ్డ ఆశ్రమంలో కిరకిరలాడుతూ ఉంటుంది. కాబట్టి నాకు వ్యవధియిస్తే దాని ఆకలి తీర్చి క్షణంలో వచ్చేస్తా. అప్పుడు నువ్వు కొమ్ముల్తో సహా తినెయ్యి" అంది.

పులి ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది.

"నీకు దూడవుందని నేను నమ్మను." అంది కళ్ళు తెరవకుండా.

"నా యీ చేసిన పొదుగు చూడు!" తనన్న మాట నిజమన్న నమ్మకంతో అంది గంగిగోవు.

"చేట పెయ్యలకి చేసే జాతి నీది" అంది ఎగతాళిగా పులి.

ఆవు అంతరాత్మ, ఆత్మాభిమానం దెబ్బతిన్నాయి. "నా దూడని నాతో కూడా తెస్తే అది బతికేవుందని నమ్మ తావా !" అంది ఆవు రోషంగా, నోట్లోకి కారిన రక్తాన్ని కక్కుతూ.

"అలా అయితే నమ్మతా. కాని వేగం వచ్చేయ్ !" అనుమతించింది పులి.

* * *

తర్వాత హంశాలు చకచకా జరిగిపోయేయి.

బాధతోనూ, ఆతురతతోనూ గంగిగోవు ఆశ్రమానికి పరిగెత్తింది. తన దూడకి ఆఖరిసారి తనివితీరా పాలు ఇచ్చు కొంది. పాలిస్తున్నపుడు దాని రక్తం దూడమీద కూడా పడింది.

ఆ తర్వాత గంగిగోవు పిల్లతో సహా హాజరైంది పులిదగ్గర.

"నీ నిజాయితీకి నేను మెచ్చేను" అని పులి దాన్ని అభినందించింది.

తర్వాత-ముందు దూడనీ, తర్వాత ఆవునీ తినేసింది.

—: o :—